సాక్షి
కుమురం భీం

మంగళవారం : 7 : మే : 2024



కోతకు గురైన రోడ్లు
కెరమెరి మండలంలో రోడ్లు కోతకు గురై ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లకు ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. IIIలో▸



నీరున్నా.. ఫలితం సున్నా
2009లో డోల్పుల వాగు ప్రాజెక్టు నిర్మించారు. కాలువలు సక్రమంగా లేకపోవడం, తూములు నిర్మించకపోవడంతో రైతులకు ఉపయోగపడటం లేదు. IIIలో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 39.8 /27.5
తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

29 నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 29 నుంచి దివ్యాంగులకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో సురేందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న మూగ, చెవిటి, కంటిచూపు సమస్యలు ఉన్న వారికి, ఈ నెల 30న మానసిక వైకల్యం, ఎముకలు, జూన్‌ 7న కంటిచూపు, 18న మానసిక వైకల్యం, 21న మూగ, చెవిటి, 28న ఎముకలు వైకల్యం కలిగిన వారికి సదరం క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. క్యాంపులకు హాజరయ్యే వారు ఆయా మండలాల పీహెచ్‌సీల్లో వికలత్వ పరీక్ష చేయించుకొని, స్లాట్‌ బుక్‌ చేసుకున్న తర్వాత క్యాంపునకు హాజరు కావాలని సూచించారు.

చెస్‌ అసోసియేషన్‌ జిల్లా కమిటీ ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్‌



ప్రధాన కార్యదర్శి కల్పన

రెబ్బెన(ఆసిఫాబాద్‌): చెస్‌ అసోసియేషన్‌ జిల్లా నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్‌ రెహమాన్‌, ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ ఈగ కనకయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు. అసోసియేషన్‌ నూతన జిల్లా అధ్యక్షుడిగా సామిల్ల సంపత్‌కుమార్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా మల్రాజు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడిగా బోగే ఉపేందర్‌, ప్రధాన కార్యదర్శిగా అంబాల కల్పన, సంయుక్త కార్యదర్శిగా ఎం.రవీందర్‌, కోశాధికారిగా పి.శ్రీనివాస్‌, ఎగ్జిక్యూటివ్‌ కమిటీ సభ్యులుగా ఎం.శృతిక, డి.హర్షితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. జిల్లాలో చెస్‌ క్రీడాభివృద్ధి నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. జిల్లా నలుమూలల క్రీడాకారులకు అందుబాటులో ఉండాలని కోరారు.

ఇన్‌చార్జి సీఈవో రాజీనామా

బెజ్జూర్‌(సిర్పూర్‌): బెజ్జూర్‌ సహకార సంఘం ఇన్‌చార్జి సీఈవోగా వ్యవహరిస్తున్న పర్ష సంజీవ్‌ వ్యక్తిగత కారణాలతో తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. రాజీనామాను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2020 నుంచి ఆయన ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అనివార్య కారణాలతోనే బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు.

'రూం టు రీడింగ్‌' పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం రూం టు రీడింగ్‌ కార్యక్రమం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, డీఈవో అశోక్‌ ఆవిష్కరించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ బాల్యం నుంచి విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించడం ద్వారా వారిలో మౌఖిక, భాషా వికాస అభివృద్ధి, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయన్నారు. వేసవి సెలవుల్లో రూం టు రీడ్‌ ఇండియా ట్రస్ట్‌, జిల్లా విద్యాశాఖ సహకారంతో రూపొందించిన 040–4520 9722 నంబర్‌ ఫోన్‌ చేస్తే ఆకర్షణీయమైన తెలుగు కథలు వినవచ్చని తెలిపారు. వీటి ద్వారా చిన్నారుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. వారి వెంట రూం టు రీడ్‌ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ జెన్నిఫర్‌ ఉన్నారు.

వేసవిలో ఆయిల్‌పాం తోటలు జాగ్రత్త

ఆసిఫాబాద్‌: ఆయిల్‌పాం తోటలు సాగు చేస్తున్న రైతులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేస్తున్నారని తెలిపారు. ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమయంలో రైతులు మూడేళ్ల లోపు ఆయిల్‌ పామ్‌ తోటల్లో మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుము, పచ్చిరొట్ట ఎరువును పంటగా నాటుకోవాలన్నారు. జనుము పూతకు వచ్చిన వెంటనే చిన్న చిన్న ముక్కలుగా కోసి పాదుల చుట్టూ వేయాలన్నారు. ప్రతీ మొక్కకు ఇరువైపులా ఒక్కో మైక్రోజెట్‌ అమర్చుకోవాలన్నారు. వేసవిలో చిన్న మొక్కలకు రోజుకు 150 నుంచి 165 లీటర్ల నీటిని అందించాలని సూచించారు. ఒక్కో జెట్‌కు గంటకు 40 లీటర్ల సరఫరా సామర్థ్యం ఉంటే రోజుకు 2 గంటలు నీరందివ్వాలన్నారు.

అధికారుల తప్పిదం.. విద్యార్థులకు శాపం

- జిల్లాలో మొదటిసారి నీట్‌ నిర్వహణ
- ఒక సెట్‌కు బదులు మరో సెట్‌తో పరీక్ష
- ఫలితాలపై విద్యార్థుల ఆందోళన
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు వేడుకోలు
- విచారణ చేపట్టిన ఆసిఫాబాద్‌ ఆర్డీవో



పరీక్ష నిర్వహించిన ఆసిఫాబాద్‌ హైస్కూల్‌



కలెక్టరేట్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఆసిఫాబాద్‌రూరల్‌: వైద్యవృత్తిలో చేరి పేదలకు సేవ చేయాలని నేషనల్‌ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్‌ టెస్ట్‌(నీట్‌– 2024)కు హాజరైన విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంలో పడింది. అధికారుల తప్పిదం వారికి శాపంగా మారింది. దేశవ్యాప్తంగా ఒక సెట్‌ ప్రశ్నపత్రంతో నీట్‌ నిర్వహిస్తే.. జిల్లాలో మాత్రం విద్యార్థులకు మరో సెట్‌ ప్రశ్నపత్రం అందించి పరీక్ష రాయించారు. రోజుల తరబడి చదివి హాజరైన పరీక్ష ఫలితాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ప్రైవేట్‌ స్కూల్‌లో సెంటర్‌..

దేశవ్యాప్తంగా మెడికల్‌ కాలేజీల్లో సీట్లను భర్తీ చేసేందుకు కేంద్రం ప్రభుత్వం ఏటా ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్‌ టెస్ట్‌ నిర్వహిస్తోంది. ఇందులో వచ్చిన మార్కులు, ర్యాంకుల ఆధారంగానే రాష్ట్రంలోని విద్యార్థులకు కూడా ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నీట్‌ నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఈ ఏజెన్సీ ప్రశ్నపత్రం రూపొందించి పరీక్ష నిర్వహిస్తుంది. నీట్‌ నిర్వహణ కోసం జిల్లాలో మొదటిసారిగా ఆసిఫాబాద్‌ పరీక్ష కేంద్రం కేటాయించారు. ఆసిఫాబాద్‌ స్కూల్‌ అనే ప్రైవేట్‌ పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 323 మంది విద్యార్థులకు 299 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారు.

ప్రశ్నపత్రం తారుమారు..

నీట్‌ కోసం ఎన్‌టీఏ ఆధ్వర్యంలో రెండు సెట్ల ప్రశ్నపత్రాలు రూపొందించారు. రెండు సెట్ల పేపర్లను ఆసిఫాబాద్‌ పట్టణంలోని ఎస్‌బీఐ, కెనరా బ్యాంకుల్లో వేర్వేరుగా భద్రపరిచారు. పరీక్షకు ముందు ఎన్‌టీఏ నుంచి నిర్వాహకులకు అందిన ఈ– మెయిల్‌ ద్వారా ప్రశ్నపత్రాలను కేంద్రానికి తీసుకురావాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఎస్‌బీఐలో భద్రపరిచిన జీఆర్‌ఐడీయూ కోడ్‌తో ఉన్న సెట్‌ ప్రశ్నపత్రాలను వినియోగించాల్సి ఉంటుంది. జిల్లా అధికారులు నిర్లక్ష్యంతో కెనరా బ్యాంకులోని ఎన్‌ఏజీఎన్‌యూ కోడ్‌ సెట్‌ ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఒక సెట్‌తో పరీక్ష నిర్వహిస్తే.. జిల్లాలో విద్యార్థులు మాత్రం మరో ప్రశ్నపత్రానికి సమాధానాలు రాశారు. జిల్లాలో నీట్‌ నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఇచ్చిన ప్రశ్నపత్రానికి బార్‌కోడ్‌ ఉండగా.. జిల్లాలో ఇచ్చిన క్వశ్చన్‌ పేపర్లకు కనీసం బార్‌కోడ్‌ కూడా లేదని విద్యార్థులు చెబుతున్నారు.

తప్పిదంపై ఆర్డీవోతో విచారణ

ప్రశ్నపత్రం తారుమారు కావడంపై కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే ఆదేశాలతో ఆసిఫాబాద్‌ ఆర్డీవో లోకేశ్వర్‌రావు విచారణ చేపట్టారు. ఎగ్జామ్‌ సెంటర్‌కు వెళ్లి సిటి కోఆర్డినేటర్‌ నరేందర్‌ను విచారించగా.. ప్రశ్నపత్రం తారుమారైందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రేను కలిశారు. న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. జరిగిన తప్పిదం గురించి నీట్‌ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని, అప్పుడే కొంత ఊరటగా ఉంటుందని కోరారు. కలెక్టర్‌ స్పందిస్తూ.. వెబ్‌సైట్‌లో అలా పెట్టేందుకు వీలు కాదని, విద్యార్థులు ఆందోళన చెందాల్సి అవసరం లేదన్నారు. విద్యార్థులకు ఇచ్చిన ప్రశ్నపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తానని పేర్కొన్నారు. అధికారికంగా రెండు సెట్ల పేపర్లకు కీ వస్తుందని తెలిపారు. కలెక్టర్‌ హామీ ఇచ్చినా తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండోసారి రాసిన..



గతేడాది నిర్వహించిన నీట్‌కు హాజరైనా ర్యాంకు రాలేదు. పట్టుదలతో చదివి మంచి ర్యాంకు సాధించాలని అనుకున్నా. ఈ సంవత్సరం రెండోసారి పరీక్ష రాసిన. అధికారుల నిర్లక్ష్యంతో నా భవిష్యత్తు గందరగోళంలో పడింది. అధికారులు న్యాయం చేయాలి. మేము రాసిన పేపర్లు దిద్దేలా చూడాలి.
– నేహా, గోలేటి, మం.రెబ్బెన

ఇంటికి వెళ్లాక గుర్తించాం



పరీక్ష రాసి ఇంటికి వెళ్లిన తర్వాత మా కాలేజీ నుంచి ఓ ప్రైవేట్‌ కీ పేపర్‌ పంపించారు. అందులోని సమాధానాలు మా ప్రశ్నపత్రంతో సరిపోలేదు. వెంటనే స్నేహితులకు ఫోన్‌ చేసి మాట్లాడగా.. పేపర్‌ మారిందని గుర్తించాం. వెంటనే పరీక్ష కేంద్రానికి వెళ్లి నిర్వాహకులకు జరిగిన విషయం తెలియజేశాం.
– దీపాంగి, ఆసిఫాబాద్‌

అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచాలి



నిర్వాహకుల తప్పిదంతో పేపర్‌ మారింది. ప్రశ్నపత్రం తారుమారైన ఘటనను నీట్‌ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలి. అప్పుడే మాకు న్యాయం జరుగుతుందని నమ్మకం కలుగుతుంది. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.
– సునైనా సదఫ్‌, ఆసిఫాబాద్‌

కాలమేదైనా.. చెలిమె నీళ్లే!



రూ.కోట్లు వెచ్చించినా.. మిషన్‌ భగీరథ పథకం తాగునీరివ్వడం లేదు. నిధులు మంజూరైనా మరమ్మతులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్‌ గ్రామస్తులకు చెలిమెల నీళ్లే దిక్కవుతున్నాయి. వర్షాకాలంలో సమీపంలోని వాగులో వరద లేని ప్రాంతంలో చెలిమెల నుంచి నీటిని తోడుకుంటారు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతుంటంతో లోతుకు చెలిమె తవ్వితేగానీ నీటిచుక్క కనిపించడం లేదు. గ్రామంలో నల్లాలు బిగించినా ఇప్పటివరకు భగీరథ నీళ్లు సరఫరా చేయలేదని గ్రామస్తులు చెబుతున్నారు. మరోవైపు మరమ్మతుల కోసం రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని మిషన్‌ భగీరథ అధికారులు వెల్లడించారు. – చింతలమానెపల్లి

పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి



సింబల్‌ లోడింగ్‌ యూనిట్‌ గదిని పరిశీలిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: సింబల్‌ లోడింగ్‌ యూనిట్ల స్టోరేజ్‌ గది వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సింబల్‌ లోడింగ్‌ యూనిట్ల స్టోరేజ్‌ గదిని సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్‌ తివారి, దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల కమిషనింగ్‌కు ఉపయోగించిన సింబల్‌ లోడింగ్‌ యూనిట్లను భద్రపరచి, గదికి సీలు వేశామని తెలిపారు. సిబ్బంది సీసీ కెమెరాలతో నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీనివాసరావు, ఎన్నికల సూపరింటెండెంట్‌ మధుకర్‌, నాయబ్‌ తహసీల్దార్లు జితేందర్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేయాలి

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, డీఈవో అశోక్‌తో కలిసి విద్యాశాఖ అధికారులు, ఎన్నికల నోడల్‌ అధికారులు, పంచాయతీ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఇంజినీరింగ్‌ విభాగం అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ పోలింగ్‌ కేంద్రాలుగా ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. విద్యుదీకరణ, తాగునీరు, మూత్రశాలలు, ర్యాంపుల పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యుత్‌ నియంత్రిక బోర్డులు అమర్చాలని, పోలింగ్‌ సిబ్బంది, ఓటర్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తా



రెబ్బెన: మాట్లాడుతున్న గోడం నగేశ్‌


- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌

ఆసిఫాబాద్‌రూరల్‌/రెబ్బెన/తిర్యాణి/వాంకిడి: జిల్లాలోని ప్రాంతాలపై భౌగోలికంగా తనకు పట్టుందని, గెలిచిన తర్వాత గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని బీజేపీ ఆదిలాబాద్‌ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ అన్నారు. ఆసిఫాబాద్‌ మండలం బూర్గుడ, రెబ్బెన మండలం గోలేటి పరిధిలోని గౌతమ్‌నగర్‌, తిర్యాణి మండల కేంద్రంతోపాటు వాంకిడిలోని మార్కెట్‌ ఏరియాలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. ఫిర్‌ ఏక్‌ బార్‌ మోదీ సర్కార్‌ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశ భవిష్యత్తు కోసం మోదీని ప్రధాని చేయాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌, పార్టీ పార్లమెంట్‌ కన్వీనర్‌ కిరణ్‌కుమార్‌, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్‌, నాయకులు వెంకటేశ్‌, రమేశ్‌గౌడ్‌, సుభాష్‌, భాస్కర్‌, గోపాల్‌, తొంగల తిరుపతి, గాయంగి తిరుపతి, విశాల్‌, సుహాసిని, లక్ష్మి, సుచిత్‌ ఉన్నారు.

ఓటేసిన అధికారులు



సిరాగుర్తు చూపుతున్న డీపీఆర్వో సంపత్‌కుమార్‌



ఓటు వేసిన తహసీల్దార్‌ శ్రీనివాస్‌

ఆసిఫాబాద్‌: ఆసిఫాబాద్‌ నియోజకవర్గంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,420 మంది పోస్టల్‌ బ్యాలెట్‌ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆదివారం వరకు 1160 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక సోమవారం 561 మంది పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు వేశారని రిటర్నింగ్‌ అధికారి దాసరి వేణు వెల్లడించారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి సంపత్‌కుమార్‌, తహసీల్దార్‌ శ్రీనివాస్‌తోపాటు పలువురు అధికారులు జిల్లా కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

రైళ్లు రావు.. బాధలు తీరవు

- లాక్‌డౌన్‌తో రద్దయిన నాగ్‌పూర్‌ ప్యాసింజర్‌
- మూడో లైన్‌ పనులతో భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ కూడా..
- మహారాష్ట్ర, హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు తప్పనితిప్పలు



సిర్పూర్‌(టి) రైల్వేస్టేషన్‌

సిర్పూర్‌(టి): సిర్పూర్‌(టి) రైల్వేస్టేషన్‌ నుంచి వెళ్లే పలు రైళ్లు రద్దయి ఏళ్లు గడుస్తున్నా పునఃప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. మహారాష్ట్రతో పాటు హైదరాబాద్‌ వెళ్లేందుకు రైలు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సిర్పూర్‌(టి) నుంచి మహారాష్ట్ర, హైదరాబాద్‌ వెళ్లే వారు కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తోంది.

2020 నుంచి రద్దు..

సిర్పూర్‌(టి) రైల్వేస్టేషన్‌ నుంచి కాజీపేట్‌–బల్లార్షా రామగిరి ప్యాసింజర్‌, సిర్పూర్‌(టి)–భద్రాచలం సింగరేణి ప్యాసింజర్‌, సిర్పూర్‌(టి)–కరీంనగర్‌ పుష్పుల్‌, కాజీపేట్‌–నాగ్‌పూర్‌ నాగ్‌పూర్‌ ప్యాసింజర్‌తో పాటు బల్లార్షా–సికింద్రాబాద్‌ భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు రాకపోకలు సాగించేవి. కరోనా నేపథ్యంలో 2020 మార్చి నుంచి నాగ్‌పూర్‌–కాజీపేట్‌ నాగ్‌పూర్‌ ప్యాసింజర్‌ రైలు, సికింద్రాబాద్‌–బల్లార్షా భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను రద్దు చేశారు. దీంతో నియోజకవర్గంలోని సిర్పూర్‌(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్‌ మండలాల ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కాగజ్‌నగర్‌ వరకే 'భాగ్యనగర్‌'

సికింద్రాబాద్‌– బల్లార్షా భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ను పునఃప్రారంభిస్తామని రైల్వే అధికారులు చెప్పినప్పటికీ కాజీపేట్‌–బల్లార్షా రైలుమార్గంలో థర్డ్‌లైన్‌ పనులు కొనసాగుతుండటంతో అంతరాయం వాటిల్లుతుందని చెప్తున్నారు. బల్లార్షా–నాగ్‌పూర్‌లైన్‌లో నూతన లైన్‌పనులు కొనసాగుతుండడంతో బల్లార్షా రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ కొనసాగించేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అందుకే రైలు బల్లార్షా వరకు కాకుండా కాగజ్‌నగర్‌ వరకే కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గ ప్రజలతో పాటు మహారాష్ట్ర గ్రామాల ప్రజలు సుదూర ప్రాంతాలకు రైలు ప్రయాణాలు సాగించేందుకు ప్రైవేటు వాహనాల ద్వారా కాగజ్‌నగర్‌ వరకు వెళ్లాల్సి రావడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

అక్కడ ఏ రైలూ ఆగడం లేదు

ఆసిఫాబాద్‌ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక రైల్వేస్టేషన్‌ రెబ్బెన మండల కేంద్రంలోని ఆసిఫాబాద్‌ రోడ్‌ రైల్వేస్టేషన్‌ మాత్రమే. రెబ్బెన, ఆసిఫాబాద్‌, వాంకిడి తదితర మండలాల ప్రజలు దీనిని వినియోగించుకుంటారు. మూడో లైన్‌ పనులతో ప్రారంభంలో ప్యాసింజర్‌ రైళ్లను కొన్నిరోజుల పాటు నిలిపివేసి మళ్లీ పునరుద్ధరించారు. మూడు నెలల నుంచి అన్ని రైళ్ల హాల్టింగ్‌ తొలగించారు. దూరప్రాంతాలకు వెళ్లాల్సినవారు బెల్లంపల్లి, కాగజ్‌నగర్‌లోని రైల్వేస్టేషన్‌ వెళ్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైళ్లను యథావిధిగా కొనసాగించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



నా కుమారులిద్దరూ హైదరాబాద్‌లో ఉన్నారు. తరచూ హైదరాబాద్‌ వెళ్లాల్సి వస్తోంది. ఇదివరకు దగ్గరలో ఉన్న సిర్పూర్‌(టి) రైల్వేస్టేషన్‌ నుంచి భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌ సౌకర్యం ఉండేది. కానీ దానిని రద్దు చేశారు. దీంతో కాగజ్‌నగర్‌ వరకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నాం
– లహాను, యాపల్‌గూడ, మం.కౌటాల

పునఃప్రారంభించాలి



సిర్పూర్‌(టి) రైల్వేస్టేషన్‌ నుంచి గతంలో కొనసాగించిన నాగ్‌పూర్‌ ప్యాసింజరు, భాగ్యనగర్‌ ఎక్స్‌ప్రెస్‌లను పునఃప్రారంభించాలి. హైదరాబాద్‌ వెళ్లేందుకు రైలు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి.
– వడ్డేటి నానయ్య, సిర్పూర్‌(టి)

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌: నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ కన్‌స్ట్రక్షన్‌, ఈజీఎంఎం– డీడీయూజీకేవై ఆధ్వర్యంలో సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ నాగేంద్రన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్‌ వైరింగ్‌, ప్లంబింగ్‌ అండ్‌ శానిటేషన్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, బుక్స్‌, యూనిఫాం, షూ, హెల్మెట్‌ అందజేస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఎన్‌ఏసీ సర్టిఫికెట్‌ ప్రదానం చేస్తామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువకులు ఎన్‌ఏసీ శిక్షణా కేంద్రం, బెల్లంపల్లిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 83285 07232, 87904 14049 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

పెళ్లింట విషాదం

- కూతుర్ని అత్తారింటికి సాగనంపి గుండెపోటుతో తండ్రి మృతి


మహ్మద్ ఎజాస్ (ఫైల్)

చెన్నూర్: అప్పటి వరకు కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులతో సందడిగా ఉన్న ఆ ఇంట్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. కూతురికి అంగరంగ వైభవంగా వివాహం జరిపించి అత్తారింటికి పంపించిన ఆ తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంఘటన చెన్నూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పబ్బావాడలో నివాసం ఉంటున్న మహ్మద్ ఎజాస్ (60) మెయిన్ రోడ్డులో జనరల్ స్టోర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి పెద్దకుమార్తె వివాహ వేడుకలను స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం కుమార్తెను అత్తారింటికి సాగనంపి ఇంటికి చేరుకున్నాడు. తెల్లవారుజామున చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కౌటాల: మండలంలోని గురుడుపేటకు చెందిన బొగరపు భీంరావు(35) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్ మధుకర్ తెలి పారు. మద్యం మత్తులో భార్యతో గొడవపడుతుండడంతో నెల రోజుల క్రితం తన ఇద్ద రు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం అతిగా మద్యం తాగి ఇంటిముందున్న సెల్ టవర్ ఎక్కడంతో స్థానికులు గమనించి వారించడంతో కిందకు దిగాడు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో సెల్‌టవర్ ఎక్కడంతో ప్రమాదవశాత్తు జారి పడడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతునికి భార్య సౌజన్య, కుమారుడు శాన్విక్, కుమార్తె శాన్వి ఉన్నారు. మృతుని తల్లి కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

'పనివేళలు మార్చాలి'

శ్రీరాంపూర్: ఎండలు ముదిరిపోవడంతో ఓసీపీల్లో కార్మికుల షిఫ్ట్ వేళలు మార్చాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎండలవల్ల కార్మికులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫస్ట్ షిఫ్ట్‌ను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సెకండ్ షిఫ్ట్‌ను సాయంత్రం 5 నుంచి రాత్రి 11 వరకు ఏర్పాటు చేయాలన్నారు.

భానుడి భగభగ..

- జనం ఉక్కిరిబిక్కిరి
- ఎండ వేడికి తోడు.. వడగాలులు
- ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల ప్రభావంతో పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఎండలో బయటకు రావొద్దంటున్న వైద్యులు


జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద నిర్మానుష్యంగా రోడ్డు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోవైపు వడగాలులు వీస్తున్నాయి. హ్యూమిడిటీ(తేమ)తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లలో ఉన్నా కూడా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఎండ వేడికి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండలు తారెత్తిస్తుంది. సాయంత్రం 5 గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. దీంతో మధ్యాహ్నం వేళ రోడ్లు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే పలువురు వడదెబ్బతో మృతి చెందారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రిలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ప్రతీ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు ఉదయం వంద ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నారు. ఎవరికి అవసరమైనా వాటిని ఆయా వైద్య సిబ్బంది అందించి, మరుసటి రోజున మరో వంద ప్యాకెట్లను అందిస్తున్నారు.

రెడ్‌జోన్‌లో జిల్లా..

జిల్లాలో ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. మంచిర్యాలలో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మంచిర్యాల, హాజీపూర్, నస్పూర్, భీమారం, జన్నారం, దండేపల్లి, కాసిపేట, చెన్నూరు, వేమనపల్లి మండలాలు రెడ్‌జోన్‌లో ఉన్నాయి. ఎండలు తారెత్తిస్తున్న నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లక పోవడమే మంచిదని, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసమై బయటకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలు..

తీవ్ర ఎండల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం, చెన్నూరు డిగ్రీ కళాశాలలోని ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయాల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ఒక్కో కేంద్రంలో 1,200ల ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు హెల్త్‌క్యాంపులు కొనసాగిస్తారు. బయటి ఆహారం తినొద్దని, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీంలు తినొద్దని సూచించారు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి



జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యవసరం అయితేనే బ యటకు వెళ్లాలి. ఎండ వేడి, వడగాలులు, తేమ శాతం పెరగడం వల్ల శరీరం డీహైడ్రేషన్ అయ్యే అవకాశం ఎక్కువ. చల్లని నీరు కా కుండా సాధారణ నీటిని తాగుతూనే, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. ఎన్నికల సిబ్బందికి ఓఆర్ఎస్ అందిస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, సబ్ సెంటర్లలోనూ మందులు, సెలైన్ బాటిళ్లు సరిపడా అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ అనిత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

నేతకాని కార్పొరేషన్ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం నరేశ్


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతకానీలు

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నేతకానీ కార్పొరేషన్ ఏర్పాటు సాధ్యమవుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం నరేశ్ అన్నారు. ఇటీవల ధర్మపురిలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సభలో నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంపై సంఘం అధ్వర్యంలో సోమవారం సీఎం, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకాని కులస్తులను ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంటెంకి పోచం, దుర్గం నగేశ్, రావుల తిరుపతి, వెంకటస్వామి, సునార్కర్ రాంబాబు, రాజేశ్, లీల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కే మాదిగల మద్దతు'


మాట్లాడుతున్న నాయకులు

చెన్నూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు తగరం మధురాజ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలతోనే హక్కులను సాధించుకుందామన్నారు. కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం మాదిగలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రావణ్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, చెన్నూర్ ఇన్‌చార్జి అశోక్, కార్యదర్శి కె.రాజు, నాయకులు నరేందర్, శ్రీనివాస్, పోచం, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లో ఉద్యోగుల పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. అధిక ఆదాయ మార్గాలు– లక్షే లక్ష్యం సాధన–ఆర్టీసీ ఉద్యోగుల కర్తవ్యం, కుటుంబ సభ్యుల పాత్ర సహకారం అనే అంశంపై మే 1 నుంచి 20 వరకు నాలుగు ఏ4 సైజ్ పేపర్లకు మించకుండా వ్యాసం రాసి డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పోటీల్లో పాల్గొనే వారిని హైస్కూల్ నుంచి ఇంటర్ వరకు ఒక కేటగిరీగా, ఆపై చదువులు చదివే పిల్లలను మరో కేటగిరీగా విభజించినట్లు తెలిపారు. వ్యాసరచన పోటీలు హడావుడిగా కాకుండా ఇంటి వద్ద నిదానంగా రాసుకునేలా అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు (ఉద్యోగుల పిల్లలు) ఆర్టీసీ సీఐ, డిపో మేనేజర్ ఆఫీసులో నమోదు చేసుకోవాలన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలి'


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

మందమర్రిరూరల్: ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటువేసి గెలిపించాలని కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ కోరారు. సోమవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంశీకృష్ణ ఎంపీగా గెలిస్తే సింగరేణిలో కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, కోలిండియాలో మాదిరిగా సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ట్యాక్స్ యాజమాన్యమే చెల్లించే విధంగా కృషి చేస్తారన్నారు. సింగరేణి పరిసర ప్రాంతాల్లో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఐఎన్టీయూసీ నాయకులు సమ్మయ్య, దేవి భూమయ్య, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు తగిలి బొలెరో దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

జైపూర్: మండలంలోని నర్వలో సోమవారం వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం విద్యుత్ తీగలకు తగలడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిర్యానికి చెందిన శ్రీకాంత్ తన బొలెరో వాహనంతో నర్వ నుంచి వరిగడ్డి తీసుకెళ్తుండగా నర్వ గ్రామ సమీపంలో విద్యుత్ తీగలకు తాకడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వరిగడ్డితో పాటు వాహనం దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. కాగా అప్పటికే వాహనం కాలిపోయింది. ప్రమాదంలో సుమారు రూ.7లక్షలవరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

'వంశీ గెలిస్తే కార్మికుల పక్షాన గొంతు వినిపిస్తాడు'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపిస్తే కార్మికుల పక్షాన గొంతు వినిపిస్తాడని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏరియాలోని కేకే–5 గని వద్ద మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు సింగరేణి కార్మికుల ఇన్‌కంటాక్స్ రద్దు కోసం పార్లమెంట్‌లో మాట్లాడానన్నారు. అప్పుడు ఉన్న స్లాబ్ ప్రకారం ఇన్‌కంటాక్స్ తగ్గింపు జరిగిందన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించామని, కార్మికులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విషపురుగు కాటుతో బాలుడు మృతి


దుర్గేష్ మృతదేహం

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి న్యూ కాలనీ పక్కనే ఉన్న మామిడితోటలో సోమవారం విషపురుగు కాటుతో రాంకరణ్ దుర్గేష్ (5) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాంకరణ్ రాంప్రసాద్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి పెద్దనపల్లి శివారులో న్యూకాలనీ వద్ద ఉన్న మామిడితోటలో కాయలు తెంపేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసే సరికి దుర్గేష్ కుడిచేతి మట్టపై వాపు కనిపించింది. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ లారీ!


సారంగపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ లారీ

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారులు ప్రైవేట్ లారీల ద్వారా ధాన్యాన్ని ప్రైవేట్ రైస్‌మిల్లులకు కమీషన్ ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన లారీల రాకకోసం రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు ప్రైవేట్ వారిని ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే ఈ కొనుగోలు కేంద్రం నుంచి రెండు లారీల ధాన్యం తరలించినట్లు రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రైవేట్ లారీలపై చర్యలు తీసుకుని త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి తరలించే విధంగా అధికారులు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

సోన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జోగేంద్ర (30) సోన్ మండల కేంద్రంలో పదేళ్లుగా హోటల్ నడిపేవాడు. అంతేకాకుండా చిట్టీలు కూడా నడిపించేవాడు. చిట్టీలలో నష్టం రావడంతో సభ్యులకు డబ్బులు చెల్లించలేక మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కొక్కానికి నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వికసించిన మే పుష్పం


విరబూసిన మే పుష్పం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని ఏఎంసీ ఏరియాలో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి ఇంటి ఆవరణలో తొట్టిలో పెంచుతున్న మే పుష్పం సోమవారం నిండుగా విరబూసింది. ఎరుపురంగును పులుముకున్న పుష్పం చూపరులకు కనువిందు చేస్తోంది.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం


రోడ్డు పక్కనే టిఫిన్ చేస్తున్న ఈశ్వర్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సోమవారం తెల్లవారు జామునే ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉదయం 6 గంటలకు శాంతిఖని గని వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. అక్కడి నుంచి బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి వెళ్లి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రచారంలో భాగంగా బజారు ఏరియాలో రోడ్డు పక్కన ఉన్న ఓ టిఫిన్ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు.

గమ్యం యాప్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ వార్డెన్ జీఆర్‌మౌళి

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో సోమవారం రాత్రి ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు గమ్యం యాప్ ఇన్‌స్టాల్, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణించే సమయంలో ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల డిపో సెఫ్టీ వార్డెన్ జీఆర్‌మౌళి పాల్గొన్నారు.

బిడ్డను చూడకుండానే కన్నుమూసిన తల్లి

- ఆస్పత్రిలో బాలింత మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో విరమణ


రవళిక (ఫైల్)


ఆందోళన కారులతో మాట్లాడుతున్న సీఐ

మంచిర్యాలక్రైం: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి కళ్లనిండా చూసుకోకుండానే కాటికి చేరుకున్న ఘటన సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బెల్లంపల్లికి చెందిన బొల్లు వెంకటేశ్ భార్య రవళిక (26) సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నందిని ఆస్పత్రిలో ప్రసవం నిమిత్తం చేరింది. ఆస్పత్రి వైద్యురాలు సాధారణ డెలివరీ చేయడంతో బాబుకు జన్మనిచ్చింది. సదరు మహిళకు అధిక రక్తస్రావం కావడంతో వైద్యురాలు అర్జంటుగా రక్తం కావాలని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంకటేశ్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తం తీసుకు వచ్చేలోగానే వైద్యురాలు నందిని బాధిత కుటుంబ సభ్యులకు చెప్పకుండానే మహిళను సమీపంలోని మెడిలైఫ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవళిక మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యురాలు నందిని, మెడిలైఫ్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రవళిక మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ బన్సీలాల్ సిబ్బందితో కలిసి ఆసుపత్రి వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ధాన్యం కొనుగోళ్లు లేక రైతుల ఇబ్బందులు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


రైతులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

మందమర్రిరూరల్: ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం మండలంలోని సారంగపల్లి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో 2.50 కిలోల మెట్రిక్ టన్నుల ధాన్యం 15, 16 రోజుల్లో రైస్ మిల్లులకు పంపించామన్నారు. ప్రస్తుతం 1.5 కిలోల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చిందని, ఆ ధాన్యాన్ని కూడా కొనలేక ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఊరుకునేది లేదన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్: ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీకి చెందిన గాందేవార్ కృష్ణమూర్తి, పుష్పలత (56) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కృష్ణమూర్తి ప్రస్తుతం ఇచ్చోడ మండలం పిప్రి గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు అదనంగా చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో తీవ్రనష్టం వాటిల్లింది. అంతేకాకుండా కుమారుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సోమవారం ఉదయం స్థానిక బంగల్‌పేట్ కాలనీలోని వినాయక్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వారిని బయటకు తీశారు. అప్పటికే పుష్పలత మృతి చెందగా కృష్ణమూర్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రీన్‌బక్కెట్ పార్శిల్ హోటల్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గ్రీన్ బక్కెట్ బిర్యానీ పార్శిల్ హోటల్‌లో సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో చోరీ జరిగింది. హోటల్ వెనుక భాగం నుంచి ఓ బాలుడు లోనికి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఆ హోటల్ యజమాని నాగేందర్ తెలిపాడు. ముగ్గురు వ్యక్తులు బయట ఉన్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్లు తెలిపాడు. మొత్తం రూ.8వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్ దొంగలించినట్లు వివరించాడు. కాగా చోరీకి పాల్పడిన బాలుడు నిర్మల్‌లో పట్టుబడినట్లు తెలిపాడు. ఈ నలుగురే ఇదివరకు రెండుసార్లు తమ హోటల్‌లో చోరీకి పాల్పడినట్లు వివరించారు.

గంజాయి స్వాధీనం

తాంసి: భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామంలో తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన దాంజీ, భీంరావు నివాసాల్లో గంజాయిని గుర్తించారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.1.28 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు.